టెండర్లు స్వీకరణ

ఆమనగల్లు, మే 6: ఆమనగల్లు జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో ప్రజల సౌకర్యార్థం క్యాంటీన్, జిరాక్స్ సెంటర్‌ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమనగల్లు బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు బార్ అసోసియేషన్‌ను సంప్రదించి టెండర్ ఫీజు రూ. 2వేలు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని వారు సూచించారు. టెండర్ రుసుము తిరిగి చెల్లించబడదని వారు పేర్కొన్నారు.

పెద్దమంగళారంలో చోరీ

మొయినాబాద్, మే 6: దుండగులు ఇంటి తాళాలు తీసి బంగారం, నగదును అపహరించిన ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారం గ్రామానికి చెందిన హరీశ్‌యాదవ్ ఈ నెల 5న మున్సిపాలిటీ కేంద్రానికి పని నిమిత్తం వెళ్లాడు. పని ముగిసే సరికి ఆలస్యం కావడంతో ఆ రాత్రి అన్న వాళ్ల ఇంట్లోనే ఉండిపోయాడు. మరుసటి రోజు మంగళవారం ఉదయం మొయినాబాద్ నుంచి పెద్దమంగళారంలోని తన ఇంటికి చేరుకునే సరికి తాళం తీసి ఉంది. దీంతో అనుమానం వచ్చి చూసే సరికి బీరువా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. అందులోని 26 తులాల బంగారం, రూ.2.50 లక్షల నగదు అపహరించారు. ఈ విషయమై హరీశ్‌యాదవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కడ్తాల్, మే 6: మండల పరిధిలోని బాలాజీనగర్ తండాకు చెందిన రామావత్ సక్రూనాయక్ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకులు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు సమాచారం అందించారు. మంగళవారం సాయంత్రం సక్రూనాయక్ మృతదేహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, జైపాల్‌యాదవ్ సమకూర్చిన రూ.5 వేలను అందజేశారు. పరామర్శించిన వారిలో మాజీ సర్పంచ్ బీచ్యానాయక్, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేందర్‌యాదవ్, నాయకులు మహేశ్, జగదీశ్ తదితరులు ఉన్నారు.

గ్రామీణ రోడ్లు గుంతలమయం

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- అభివృద్ధికి నోచుకోని లింకురోడ్లు..
- రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని వేడుకుంటున్న వాహనదారులు
- గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రూ.17.06కోట్లు మంజూరు

ఆగాపల్లి-జాపాల్ రోడ్డులో ఏర్పడిన గుంతలు

ఇబ్రహీంపట్నం, మే 6 : నియోజకవర్గంలో ఆయా గ్రామాలను కలుపుతూ ఉన్న ప్రధానరోడ్లలో గుంతలు ఏర్పడి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందిగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లోని పలు గ్రామాలను కలుపుతూ ఉన్న ప్రధానరోడ్ల వెంట ప్రయాణించాలంటే అవస్థలు పడుతున్నట్లు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ నుంచి పోల్కంపల్లి, పోల్కంపల్లి నుంచి నెర్రపల్లి, నెర్రపల్లి నుంచి దండుమైలారం, చర్లపటేల్‌గూడ నుంచి తుర్కగూడ, కప్పాడు, తులేకలాన్‌తో పాటు మంచాల మండలంలోని మంచాల – జాపాల, ఆగాపల్లి – జాపాల్, మంచాల నుంచి చిత్తాపూర్, తాళ్లపల్లిగూడ, యాచారం మండల కేంద్రం నుంచి మల్కీజ్‌గూడ, మేడిపల్లి, నానక్‌నగర్‌తో పాటు మరిన్ని గ్రామాలను కలుపుతూ ఉన్న ప్రధాన రోడ్లలో గుంతలు ఏర్పడి రాత్రి సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాలకు సంబంధించిన సింగిల్‌రోడ్లను డబుల్‌రోడ్లుగా అభివృద్ధి చేశారు. ఇందుకోసం నిధులు కేటాయించినప్పటికీ తదనంతరం ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వీటిపై దృష్టి సారించకపోవటంతో ఈ నిధులు వెనక్కి మళ్లించారు. దీంతో గ్రామీణ ప్రాంతాల రోడ్ల పనులు పూర్తిగా నిలిచిపోయాయని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు.

గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రూ.17.06కోట్లు

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.17.06కోట్ల నిధులు విడుదల చేయించారు. ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాలను కలుపుతూ ఉన్న లింకురోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించి టెండర్లు కూడా పూర్తిచేయించారు. కానీ, తదనంతరం ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పనులు కొనసాగించకపోవటంతో నిధులు వెనక్కి మళ్లించారు. నియోజకవర్గంలోని ఖానాపూర్ గేటు నుంచి బైపాస్‌రోడ్డు నిర్మాణానికి రూ.3.50కోట్లు, బాటసింగారం పాత హైవే రోడ్డు నిర్మాణానికి రూ.3కోట్లు, మినీస్టేడియం నిర్మాణానికి రూ.2.50కోట్లు, మంతన్‌గౌరెల్లి నుంచి శ్రీమంతగూడ రోడ్డుకు రూ.2కోట్లు, కుత్బుల్లాపూర్ నుంచి గౌరెల్లి రోడ్డుకు రూ.1.30కోట్లు, మంచాల నుంచి జాపాల మీదుగా ఆగాపల్లి రోడ్డుకు రూ.4.30కోట్లు, కొర్రెముల్ నుంచి బాచారం రోడ్డుకు రూ.1.30కోట్లు, మాల్ నుంచి కిషన్‌పల్లి, కొత్తపల్లి రోడ్డుకు రూ.4కోట్లు, తులేకలాన్ నుంచి ధర్మన్నగూడ రోడ్డుకు రూ.80లక్షలు, నందివనపర్తి నుంచి చౌదర్‌పల్లి రోడ్డుకు రూ.76లక్షలు, ఎలిమినేడు నుంచి సాహెబ్‌గూడ రోడ్డుకు రూ.50లక్షలు, తాళ్లపల్లిగూడ నుంచి చిత్తాపూర్ మీదుగా మంచాల రోడ్డుకు రూ.1.50కోట్లు, ఎలిమినేడు నుంచి మాదాపూర్ రోడ్డుకు రూ.1కోటి, మంచాల నుంచి లింగంపల్లి రోడ్డుకు రూ.కోటి, కొమ్మోని బాయి రోడ్డుకు రూ.40లక్షలు, అయ్యవారి గూడ రోడ్డుకు రూ.40లక్షలు, నిధులను పంచాయతీరాజ్, హెచ్ఎండీఏల ద్వారా మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే వివరించారు.

గుంతల మయంగా మారిన నెర్రపల్లి రోడ్డు

అభివృద్ధి ఊసేలేదు

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులు మాత్రమే నియోజకవర్గంలో కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్ల అభివృద్ధి పనులకు చర్యలు చేపట్టడంలేదు. గ్రామీణ ప్రాంతాల రోడ్లు గుంతలమయంగా మారటంతో ఇబ్బందులు తీవ్రమవుతున్నాయి. ఈ ప్రాంత ఎమ్మెల్యే గుంతలు పడిన రోడ్లను బాగు చేసి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలి.

- మహ్మద్ జానీపాషా, మార్కెట్‌కమిటీ మాజీ డైరెక్టర్

గుంతల రోడ్లతో ఇబ్బందులు

గ్రామీణ ప్రాంతాల రోడ్లు ఇబ్రహీంపట్నం ప్రాంతంలో అధ్వానంగా మారాయి. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణానికి పనికిరాకుండా ఉన్నాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో ప్రయాణాలు సాగించేవారు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన ప్రభుత్వం ఏమి పట్టనట్లుగా వ్యవహరిస్తోంది. వెంటనే గ్రామీణ రోడ్ల అభివృద్ధి చేపట్టాలి.

- నిమ్మల ప్రసాద్‌గౌడ్, నెర్రపల్లి

సబ్ రిజిస్ట్రార్‌పై దాడి హేయమైన చర్య

జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు రామారావు

ఆదిబట్ల, మే 6: విధి నిర్వహణలో ఉన్న రంగారెడ్డి జిల్లాలోని పెద్దఅంబర్‌పేట సబ్‌రిజిస్ట్రార్ రవిందర్‌నాయక్‌పై జరిగిన దాడి హేయమైన చర్య అని జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు కె.రామారావు, సెక్రెటరీ శ్రీనేశ్‌కుమార్ నోరీ అన్నారు. ఈ దాడిని జిల్లా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఇలాంటి అమానూష చర్యలు ఇక ముందు జరుగకుండా ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని వెంటనే దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి జైలుకు పంపి ఉద్యోగస్తుల్లో ఆత్మస్థైర్యం నింపాలని అధికారుల సంఘం డిమాండ్ చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పని చేస్తారని, ఎవరైనా అధికారులు ఏదైనా తప్పు చేస్తే పై అధికారులకు ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. కానీ భౌతిక దాడులకు దిగడం హేయమైన చర్య అన్నారు. దీనిని ఖండిస్తూ తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం, రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలతో ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేయడం జరిగిందని అన్నారు. స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ సబ్ రిజిస్ట్రార్ సంఘం బాద్యులు సహదేవ్, స్థిత, ప్రజ్ఞతో కలిసి శ్రీబుద్ధప్రకాశ్, ఐఏఎస్ కమీషనర్ అండ్ ఇన్‌స్పెక్టర్ జనరల్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌ను కలిసి దోషులపై కఠినమైన చర్యల తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్, వెంకట్, శాంతిశ్రీ, అలివేలు, లక్ష్మణ్, స్వామి, సుజాత, సైదమ్మ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుతో అధిక లాభాలు

షాద్‌నగర్‌రూరల్, మే 6: ఉద్యాన పంటల సాగుతో రైతులు అధిక లాభాలను పొందవచ్చని అగ్రికల్చర్ ఆఫీసర్ హిమబిందు, రీసెర్చ్‌స్టేషన్ డాక్టర్ ప్రభావతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్ గ్రామ పంచాయతీ ఆవరణలో శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం(2021)బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పంట మార్పిడి విధానం ద్వారా పంటలను సాగు చేస్తే చీడపీడల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. సేంద్రియ వ్యవసాయం, పచ్చిరొట్ట ఎరువుల వాడకం, బహుళ అంచెల పంట సాగు, అంతర పంటలు, పట్టు పురుగుల పెంపకం, బిందు సేద్యం, భూసార పరీక్షల ఆవశ్యకతను వివరించడంతో పాటు పంటల సాగులోని మెళుకువలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

షాబాద్, మే 6: గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తామని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి గ్రామంలో ఈసీ వాగుపై రూ.2కోట్లతో నిర్మాణం చేపడుతున్న బ్రిడ్జి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిధులతో గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నర్సింహులు, శ్రీరాంరెడ్డి, నాయకులు అమరేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కిష్టయ్య, శ్రీనివాస్, నర్సింహులు, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం

షాబాద్, మే 6: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989–1990 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా మంగళవారం ఓ రిసార్ట్స్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. నాడు పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు వీరస్వామిగౌడ్, యాదగిరిచారి, నర్సింహారావు, అడివప్ప, పురుషోత్తం, పూర్వ విద్యార్థులు నర్సింహులు, శ్రీశైలం, జగదీశ్వర్, మల్లేశ్, మదన్, శ్రీనివాస్, మంజుల, కుసుమకుమారి, అంజి, శివ, ఆంజనేయులు, రాములు, రమాదేవి, కృష్ణ, బాల్‌రాజ్, దర్శన్, మల్లారెడ్డి తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

మంచాల, మే 6: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా మౌలిక వసతులు సర్కారు కల్పిస్తున్నదని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విద్యా కమిటీ సభ్యులు భాస్కర్, శ్రీశైలం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలోని వెంకటేశ్వర నగర్ కాలనీలో 'మన బడి–మన ఊరు' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఆరుట్ల ప్రభుత్వ పాఠశాలలో కూడా మెరుగైన విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర విద్యా కమిషనర్ చైర్మన్ మురళి దత్తత తీసుకొని పాఠశాలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు దుబ్బాక సూర్యం, వెంకటేశ్, మురళి పాల్గొన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

కేశంపేట, మే 6: కేశంపేట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల మండల స్థాయి ఎంపిక కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేముల్‌నర్వ కెనరా బ్యాంకు, కేశంపేట ఎస్‌బీఐ, కేశంపేట, నిర్దవెల్లి కెనరా బ్యాంకుల మేనేజర్లు, ఎస్సీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 1673 దరఖాస్తులు పరిశీలించడం జరిగిందని, రాజీవ్ యువ వికాసం పథకం నియమ నిబంధనల మేరకు లబ్ధిదారులను ఎంపిక చేయాల్సిందిగా సూచించినట్లు పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారులకు సంబంధించిన పూర్తి వివరాలను బ్యాంక్ సిబ్బందికి అందజేసినట్లు ఎంపీడీవో వివరించారు. కార్యక్రమంలో ఎంపీవో కిష్టయ్య, సెక్షన్ అధికారి జయప్రకాశ్, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

కందుకూరు, మే 6: కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను విస్మరిస్తోందని సీఐటీయూ మండల కార్యదర్శి బుట్టి బాలరాజ్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ పద్మావతికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు అన్ని రంగాల కార్మికులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజన, గ్రామపంచాయతీ, వీఓఏ, రవాణా సంఘం కార్మికులు, ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగ సంఘాలు, పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు సరస్వతి, లక్ష్మీదేవి, భాగ్యలక్ష్మి, కవిత అప్రోచ్, ముంతాజ్, ఆండాళు, రజిత, రేణుక, సురేఖ, జయసుధ, చంద్రకళ, మాధవి పాల్గొన్నారు.

నీటిశుద్ధి కేంద్రం ప్రారంభం

కొందుర్గు, మే 6: దాతల సహకారంతో నిర్మించిన నీటిశుద్ధి కేంద్రాన్ని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. కొందుర్గు మండలంలోని శ్రీరంగాపూర్ పంచాయతీలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరైన కలెక్టర్ నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల శ్రేయస్సుకోసం ప్రజాప్రతినిధులలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సయ్యద్‌సాధిక్, అశోక్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మల్లేశ్‌గౌడ్, గోవర్ధన్ గౌడ్, మహేందర్‌రెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అవగాహన కార్యక్రమాలు

షాబాద్, మే 6: ఈ నెల 8వ తేదీ నుంచి 'రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు, అన్నదాతలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ సాంకేతికతను అందించాలనే లక్ష్యంతో ఈ నెల 5 నుంచి జూన్ 13వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మే 8న లక్ష్మారావుగూడ, సోలీపేట, మే 16న తిమ్మారెడ్డిగూడ, మద్దూర్, 23న ఏట్ల ఎర్రవల్లి, హైతాబాద్, 30న మక్తగూడ, పెద్దవేడు, జూన్ 6న రేగడిదోస్వాడ, చందనవెల్లి, 13న తిర్మలాపూర్, రుద్రారం గ్రామాల్లో నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో వ్యవసాయ పరిశోధన ప్రధాన శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొంటారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెద్దఅంబర్‌పేట, మే 6: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై పెద్దఅంబర్‌పేట మొదటి బ్రిడ్జి వద్ద 35 ఏండ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ముఖాన్ని గుర్తించే పరిస్థితిలో లేదని, బ్లూ జీన్స్, బ్లాక్ షర్ట్ వేసుకుని ఉన్నాడని పోలీసులు తెలిపారు. 100కు వచ్చిన కాల్ ఆధారంగా ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించినట్టు చెప్పారు.

సమ్మెను విజయవంతం చేయండి

అధికారులకు సమ్మె నోటీసులను అందజేస్తున్న ఆశ వర్కర్లు, సీఐటీయూ నాయకులు

మంచాల, మే 6: ఈనెల 20న జరుగనున్న దేశవ్యాప్త సమ్మెలో ప్రతి ఒక్క కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ అన్నారు. మంగళవారం మంచాల మండలం ఆరుట్ల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఆశ వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నోటీస్‌ను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం కాల రాసేందుకు లేబర్‌కోడ్ తీసుకువస్తుందని చెప్పారు. కార్మికులు, కర్షకులు ఉద్యమాలు చేసి ఎనిమిది గంటల పని దినాన్ని సాధించుకుంటే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం యజమానులకు అనుకూలంగా 12గంటల చట్టాన్ని తీసుకురావాలని చూస్తున్నదని ఆరోపించారు. అందుకే ఈనెల 20జరిగే దేశ వ్యాప్త సమ్మెలో పెద్ద ఎత్తున కార్మికులు, కర్షకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అమృత, కవిత, రజిత, నవనీత, సంతోష, అలివేలు, జ్యోతి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏడీఏకు ఉద్యోగోన్నతి

షాద్‌నగర్‌టౌన్, మే 6: షాద్‌నగర్ వ్యవసాయశాఖ ఏడీఏ రాజారత్నంకు ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. వ్యవసాయ శాఖ ఏడీఏగా బాధ్యతలు నిర్వహించిన ఆయన నారాయణపేట్ జిల్లాకు అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ(ఆత్మ)లో డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్‌గా ఉద్యోగోన్నతిపై వెళ్లనున్నారు. ఆయనను మంగళవారం వ్యవసాయాధికారులతో పాటు డీలర్లు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు, మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్, వివిధ మండలాల అధికారులు నిశాంత్‌కుమార్, రాజేందర్‌రెడ్డి, గోపాల్, సురేశ్‌రెడ్డి, శోభా, మండలాల వ్యవసాయ విస్తరణ అధికారులతో పాటు డీలర్లు పాల్గొన్నారు.

ఉచిత బస్‌పాసుల పంపిణీ

ఇబ్రహీంపట్నం, మే 6 : మండల పరిధిలోని పోచారం గ్రామంలో మంగళవారం ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ కృపేశ్ తన పుట్టినరోజు సందర్భంగా దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రమేష్‌తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్, మే 6: తెలంగాణ మాడల్ స్కూల్, జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షాబాద్ మాడల్ కళాశాల ప్రిన్సిపాల్ కవిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు సేవలు మే 20వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితా మే 26న సంస్థ నోటీసు బోర్డులో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. అదే విధంగా సర్టిఫికెట్ల ధ్రువీకరణ, ప్రవేశ ప్రక్రియ 27 నుంచి 31వ తేదీ వరకు పూర్తవుతుందన్నారు.

కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

చేవెళ్లటౌన్, మే 6: చేవెళ్ల మున్సిపాల్ కేంద్రంలోని తెలంగాణ మాడల్ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్పరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్లలోని తెలంగాణ మాడల్ స్కూల్, జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరానికి ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు చేవెళ్లలోని తెలంగాణ మాడల్ జూనియర్‌లో కళాశాలలో ప్రవేశానికి ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. చేవెళ్లలోని తెలంగాణ మాడల్ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

రిటైర్డ్ జీహెచ్ఎంలకు ఘన సన్మానం

రిటైర్డ్ జీఎహెచ్ఎంలను సన్మానిస్తున్న గణిత ఫోరం సభ్యులు

షాద్‌నగర్‌టౌన్, మే 6: ఇటీవల రిటైర్డ్ అయిన జీఎహెచ్ఎంలు పాండురంగయ్య, వెంకటయ్యలను తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో గణిత ఫోరం షాద్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు నర్సింహులు, సభ్యులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులుగా వారు అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. అనంతరం రిటైర్డ్ జీహెచ్ఎంలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ చిన్నంబావి ఎంఈవో గణేశ్, జీహెచ్ఎంలు బాబుచంద్, మల్లేశ్వర్, ఫోరం సభ్యులు, ఉపాధ్యాయులు రామకృష్ణ, తిరుపతిరెడ్డి, రమామహేశ్వర్, రాంచంద్రారెడ్డి, రాములు, శ్రావంతి, శైలజ పాల్గొన్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

ఆర్కేపురం, మే 6 : సరూర్‌నగర్ డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ పేర్కొన్నారు. డివిజన్ అభివృద్ధికి మంజూరు చేయబడిన, చేపట్టాల్సిన పెండింగ్ అభివృద్ధి పనులపై మంగళవారం ఏఈ ప్రశాంతితో కార్పొరేటర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డివిజన్ అభివృద్ధికి అన్ని శాఖల అధికారులను సమన్వయ పరుస్తూ అవసరం ఉన్న కాలనీలో అభివృద్ధి పనులు చేపడుతూ ముందుకెళ్తున్నామన్నారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ, ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నుంచి పన్నులు వసూళ్లు చేసి అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదన్నారు. పెండింగ్